# నేతి బీరలు

శ్రీ కందుకూరి లింగరాజు

ఆ మహానాయకుడు, అనర్గళంగా, పార్కు వేదిక నుండి, మైక్‌లో ఘంటన్నరా ఉద్ఘాటించేడు. ఈ నాటి దేశపరిస్థితిని, కావలసిన చైతన్యాన్ని, వస్తున్న ఉన్నతిని గూర్చి, ఒక్క అక్షరమైనా పొల్లు పోకుండానే సోమయాజులు విన్నాడు.

జనంలో అడ్డుపడ్డప్పుడు "ఆయన మంచి వక్త" అన్నారు ఒకరు.

"సరుకు లేదు ఉపన్యాసంలో" ఇంకొకరు.

"ఏమైనా ఆయన గొప్ప త్యాగి. దేశ స్వాతంత్ర్య సమరంలో మూడుసార్లు జైలుకు వెళ్ళి వచ్చేడు. వచ్చే మంత్రి వర్గంలో కనీసం ఉప మంత్రైనా అవుతాడు"

"ఏం త్యాగం చేసేడు.... ఆ చందాలు, ఈ చందాలు అని రామవరంలో రెండంస్థుల మేడ కట్టించేడు" అని ఒకడు గట్టిగా నవ్వేసేడు.

బుర్ర తిరిగిపోయింది యాజుల్కు, ఈ విరుద్ధ విభావనల్తో. ఆయన త్యాగా కాదా అన్నది నిర్ణయం చెయ్యడం కష్టమూ అయ్యింది.

ఇదివరకు చాలా మంది ఉపన్యాసాలు విన్నాడు. అవన్నీ బాగుగానే ఉన్నాయనీ అనిపించేయి. వాళ్ళంతా పెద్ద త్యాగాలు చేసేరు దేశం కోసం అన్న భావనా ఏర్పరచుకున్నాడు. దాంతో గౌరవమూ పెంపయ్యింది.

ఇవి తలచుకున్నప్పుడల్లా "నీకు ముప్పయి సంవత్సరాలు దాటేయి. ఏం త్యాగం చెయ్యగలేవ్ ?" అన్న ప్రశ్న రేకెత్తింది. దాంతో, సింహావలోకనం చేయసాగాడు.

చదువు, పెళ్ళి, తల్లి దండ్రులు, ఉద్యోగం, సంసారం, ఆఫీసులో పని, ఒక్కొక్కటి తలిస్తే, తనుచేసే ప్రతీపని ఆఖర్కు సంపాదనకూడా ఎవళ్ళకో ఒకళ్ళకు త్యాగం, తృప్తి, ఉన్నతి, గౌరవం కల్గించడానికి అని తట్టేది. చదువుకుని —ఒక్క క్లాసూ తప్పకుండా— ఉద్యోగం చేస్తుంటే, తల్లీ దండ్రీకూడా మురిసిపోయి "మా వాడు ఫలానా ఉద్యోగం చేస్తున్నా"డని గర్వంగా చెప్పడం, భార్యకూడా ఆఫీసరుగారి భార్య హోదాలో మసలడం, అటు ఆఫీసుల్లో పై ఉద్యోగులు "నమ్మకస్తుడు, పని క్షుణ్ణంగా తెలుసును." అని అంటూనే ఇంకో గాడిద బరువు పెట్టి, కోటు బొత్తాములు విప్పుకుని ఉండడం, పైగా ఏ రోడ్డమ్మట వెళ్ళినప్పుడో పది మంది నమస్కారంపెట్టి గౌరవించడం, "మా పని ఇంకే విధంగా దరఖాస్తుపెడితే సానుకూలం అవుతుంది. మీరు చట్టప్రకారం చెప్పాలి" అని వయస్సు మళ్ళినవాళ్ళు అడగడం, ఆఖరుగా సంసారంలో వచ్చిన చుట్టపు స్నేహపు చూపు వాళ్ళందరూకూడా "చిలకా గోరింకల్లా వున్నారు. శుభ్రత కంజాయింపుకూడా నేర్చుకోవాలి. ఆయన కెంత శ్రద్ధ" అనడం.... ఇవన్నీచూస్తే, జీవితంలో తన అంతస్థుకు సరిపడట్టుగా తానూ త్యాగం చేసేడు. వర్తి వ్యర్థంకాలేదు అన్న అనునయం మైపూత అయ్యేది

దాంతో సోమయాజులు తృప్తి పడ్డాడు. తను కొడుకుగా, భర్తగా, ఉద్యోగిగా, సంసారిగా, ఓ సాధారణ మానవునికన్న ఉన్నతిలోనే ఉన్నట్లూ తట్టితే జీవితంమీద ఆశ కల్గింది. ఇంకా ఎక్కువగా త్యాగంచేసి, ఓ శాశ్వతమైన పేరు సంపాదించాలనీ, అప్పుడు.... అప్పుడు... తక్కింది ఊహల్లో పీయూషం అయిపోతే ఉక్కిరి బిక్కిరి అయిపోయేడు.

ఠక్కున ఆ మహానాయకుడినిగూర్చి, చెడుగా చెప్పుకున్న అంశం పీడించింది. అవన్నీ పగలుకు రాత్రి, చీకటికి వెన్నెల, సత్యానికి అబద్ధం, సౌందర్యానికి కురూపత్వం, శాంతికి అశాంతి, ఆనందానికి దుఃఖం, కుడికి ఎడమ ఎల్లాఆధారాలో అవితట్టితే, తేలిగ్గా తీద్దామనుకున్నా. త్యాగానికి స్వార్థంకూడా ప్రతి కక్షి అన్నవిషయం నిరు కవుతోంది సృష్టి సత్యం అన్నట్లు.

అయినా, స్వార్థంలేని క్రియాత్మకంగా, మానవుడు జీవిస్తే.... ఏదో తలంపు, దానివెనుక భగవద్గీత జ్ఞాపకంవస్తే ... 'ఏమిటీ తుక్కు' అనుకున్నాడు.

సందు మొగ తిరిగేటప్పుడు ఎవరో బీదవాడు వెంటబడ్డాడు. ఎందుకో చెప్పలేని జాలికల్గితే "ఒరే ! అబ్బీ మా ఇంటికి వస్తావా పాత చొక్కా ఇస్తా" అన్నాడు. ఉదయం బట్టలు తీసుకుందామనుకున్నప్పుడు వెతకడం మొదలిడితే అరడజను తొడుక్కుందుకే పనికిరానివి కనపడ్డాయి.

వళ్ళంతా కృతజ్ఞతతో అణుకువే అయిపోయి వాడు వెంబడి బడ్డాడు. ఒకళ్ళిద్దరు ఎదురైనవాళ్ళు "పీ దెక్క డికి" అన్న చూపులు ప్రదర్శించినా, తను మాట్లాడలేదు.

ఇంటిగుమ్మం ఎక్కేటప్పటికి, పాతగుడ్డలకు ఇత్తడి సామాన్లు ఇచ్చేవాడితో, ఉన్నవన్నీ ప్రోగుచేసి "ఆపెద్ద టిఫిన్‌క్యారీ ఇస్తేఇయ్యి లేకపోతే వెళ్ళు" ఖరాఖండీగా మాట్లాడుతోంది.

హృదయం బితుక్కుమంది. వాడు తెల్లపోయిన చూపుల్లో నిరాశ కల్పుకున్నాడు. అయినా 'పో వెధవా!' అన్న అలవాటులో ఎక్కువచేసుకోలేదు. సామాన్లవాడు మొరాయించి వెళ్ళిపోయేడు.

ఇవ్వలేదన్న కోపంలో "పీడెవరు ...వెంటబెట్టుకు వచ్చేరు ?"

"గాలికీ ధూళికీ ప్రియుడు"

"అయితే"

"ఓపాతచొక్కా తీసి వాడికియ్యి."

"ఏమిటీ ?"

చెప్పేడు. వాడు నిట్టూర్పు విడిచేడు.

"నేను ఇవన్నీపెట్టి ఏ ఇత్తడిక్యారియరో కొంటే మధ్యాహ్నమప్పుడు మీరు ఆఫీసుకు టిఫిన్ పట్టుకు వెళ్ళవచ్చునన్న ఉద్దేశ్యంలోవుంటే... ఈదానాలకు ధర్మా లకు ఉన్నాయనుకున్నారా ?"

"అది కావలిస్తే పైసలిచ్చి కొనుక్కోవచ్చు...."

"ఆ మహా కొన్నాం....కొనబోతాం...."

"ఓ చొక్కా ఇద్దూ ? వాడిని బజారునుండి ఆశపెట్టి తీసుకువచ్చే"

మూలుగుతూ, ముక్కుతూనే, ఝాడించి ఇచ్చింది. వళ్ళంతా నవ్వుపూసుకుని ఇసుకలో ప్రతిబింబం చూసు కున్నాడు వాడు; వంగి వంగి దండాలుపెడుతూ.

హృదయం ఎగిరింది. వాడి తృప్తినిచూస్తే, తనకే అదిరా దన్నట్లువుంది....గిన్నెల మధ్య "ఏమిటో ఈ దానాలు ధర్మాలు, త్యాగాలున్నూ...." వినిపిస్తూనే వుంటే నవ్వుకున్నాడు.

టిఫెన్‌క్యారియర్ కొనడానికి ఒక్క చిరిగిపోయిన చొక్కా లెఖ్ఖల్లోది తక్కువైందన్న కోపం, ఆవిడిది. తనమీద కోపం; అర్థంకాని ద్వేషం....

నెమ్మదిగా ఇందులోవున్న ఉన్నతి అర్థం అవుతుంది అనుకున్నాడు.

ఆ భోజనాల దగ్గరనే "పాత చొక్కాలుగా మారడం ఎంతసేపు. ఇవన్నీ తాత్కాలికాలేగా ! అంత బాధ పడకూడదు ఎప్పుడున్నూ. వాడు ఎంత తృప్తిపడ్డాడో చూచేవా ? ఈనాటి పరిస్థితుల్లో ఈమాత్రమైన మనం త్యాగం చెయ్యడానికి వీలుకల్గుడానికి దేవుడికి కృతజ్ఞత చూపించాలేమో !"

"ఏమిటీ మెట్టవేదాంతం" అన్నట్లుచూచి, విస్తళ్ళల్లో కలియబడింది.

• • •

ఒకవిధమైన మధ్యతరగతి స్థాయిలో సోమయాజులు. తనుచేసే ప్రతీపనిలోనూకూడా ఇంత 'త్యాగం' అనే క్రియ ఎంతశాతంలోవుంది అనే భావనతో నింపడం. పి. డబ్ల్యూ. వాళ్ళు పనులకు అందాజా పట్టికలు తయారు చెసినట్లే తన పనులకుకూడా కేటాయింపులు మొదలు పెట్టేడు.

ఒక్కొక్క సారి కొన్ని విషమ పరిస్థితులు ఎదురయ్యేవి. తనతాహతుకు మించివెళ్ళడం అన్న అడ్డంకి కన్పించేది. అది అతీతంకూడా అయ్యేది. అప్పుడు మనస్సు బాధపడితే "ఎందుకు ఈమధ్య తర గతి స్థాయిలో పుట్టించేవు ? ఏవిధంగానూ నేను త్యాగం చెయ్యలేని పరిస్థితుల్ని కల్గచేస్తావు ? ఎందుకు ఈ పుష్కలంగా డబ్బులేని జీవితం ఇచ్చేవు ? ఈ భరించుకో లేని జాలి ఎందుకు ఇచ్చేవు" అనే కుమిలింపు, నిస్పృహ కల్గేది. పైగా తన దృక్పథంలోకి ఇంటావిడ చూచే వికృతంకు తట్టుకోలేకపోయేడు.

"మనకు మడులూ మాన్యాలు ఒరిగిపోయేయా ? పుట్టించినపుడు బ్రతకడంకూడా వాళ్ళందరికీ నేర్పేడు. మహామహులే ఇల్లాంటి పిచ్చి తలంపులు పెట్టుకోలేదు. పెట్టుకుంటే వాళ్ళు వుండేవాళ్ళుకారు..." అన్న వరసలో జోరీగ అయ్యింది జరిగేరోజుల్లో.

ప్రత్యేకంగా ఆనాడు ముగ్గురిని భోజనానికిపిల్చేడు. ముగ్గురుకూడా రెండురోజులనుండి అన్నం తినలే దని

చెప్పినవాళ్ళే. కళ్ళమ్మట కబళంకోసం కన్నీరుతిప్పుకున్న వాళ్ళే,

కరగిపోయే పిల్చేదు....

వస్తూనే కూరలూ పట్టుకువచ్చేడు. ఇంట్లోకివెళ్ళి "వాళ్ళు పాపం భోజనానికే కరువువచ్చినట్లు నకనకలాడిపోతున్నారు. ఈపూట...." ప్రాధేయపడుతూ పడ్డట్లే చేతులుజోడించేడు.

తారాజువ్వలా లేచిపోయింది. "ఈ అడ్డమైనవాళ్ళకూ చెయ్యడానికి నాకేం పట్టలేదు అంత అపేక్షవాలికిపోతే, మీరే వండిపెట్టండి" అంటూనే తలకట్టుకుంది.

తనే చెయ్యికాల్చుకున్నాడు.

విస్తట్లో పెట్టినవి వాళ్ళు తినలేక దిక్కులుచూస్తుంటే "కనీసం మజ్జిగతోనైనా తినండి నాయనలారా" అనే అన్నాడు.

లేచి వంగి నమస్కారాలుపెడితే వల్లమాలిన సిగ్గుతోనే తలవంచుకుని దాసోహం అనేసేడు.

తలుపువేసినపుడే ఒళ్ళు కుతకుతలాడింది. నాలుగు ఉతకా లనుకున్నాడు. గది గుమ్మంవరకూ వెళ్ళేడు. తలగడా అంచుల్లోంచి చూస్తున్న దాన్నిచూస్తే మిరియపు కలికం పెట్టినట్లేఅయితే, రెండడుగులు వేగంగావేసినా గుండెలునిబ్బరం లేక గుబగుబలాడేయి.

టాక్కున...."అవును సోమయాజులూ, నువ్వు పెళ్ళెందుకు చేసుకున్నావ్ ?'' అన్న ప్రశ్న టూకాయిస్తే ఉలికి కుమిలేపోయేడు....

తన స్వార్థంకోసం. ఉదయం కాఫీలగాయతు, రాత్రి తాంబూలచర్వణం, దానితర్వాత వెన్నెల్లోని కోర్కెలు.... అన్నిటికోసం అంటే తనెంత స్వార్థపరుడో....ఆఖరుకు మనుష్యుల్ని కొనుక్కుని ఉపయోగించేంత ఛండాలుడు నీచుడు ..." అన్న భావనే పెచ్చుపెరిగితే....గుమ్మంలోంచి పరిగెత్తే, సావిట్లో కూర్చున్నాడు.

స్వార్థం, త్యాగం అంటే ఏమిటి? అన్న సాలోచనల్లోనే మునిగిన్నిపోయేడు. తను ఈవిపరీతంలో ఏమైనా పొరపాటు చేస్తున్నాడా అన్న సంశయమూ కల్గింది.

• • •

అమర్నాడు. ఎవరెవరో వచ్చేరు.

"ఆఫీసుర్లల్లా, సరిగ్గా మాట్లాడకల్గినవారు, సలహా చెప్పగలిగినవారు మీరు ఒక్కరే!" అని ఒకరు.

"మీరు ఎప్పుడు పైమెట్టు రెక్కాలారో దేవుడిని ప్రార్థిస్తున్నాం" అని ఇంకొకరు....

"ఏమీ అనుకోకపోతే ఒక్కమాట చెపుతాం మీలాంటి వాళ్ళను...."

ఆ వరసలో అనడం తబ్బిబ్బుచేసింది. కోపంతీరని ఇంటావిడ వింటోందా లేదా అన్నంత ఆవేశమూ వచ్చింది. దాంతో తన ధృక్పథంలో అది ఎందుకు చూడదూ? అన్న మీమాంస కల్గింది. ఇదంతా తన ధృక్పథం ఓటిపోవటంలేదని ఎందుకు గుర్తించదూ?

ఆకబురూ, ఈకబురూ చెప్పి, చందా అంటూ పది రూపాయలు వసూలుచేసుకుని వెళ్ళేరు.

రెండురోజుల క్రితం, భార్య, "జాకెట్లు అన్నీ చిరిగిపోతున్నాయి. ఓ అరడజను కొని తెండి అన్న ముక్క మెసలింది. దానికోసం తీసిన జరుగపెట్టుకున్నది ఇవ్వాళ ఎగిరిపోవడంతో బాధకల్గినా...పదిమందిలోనూ భలానా ఆయన ఇంత చందా ఇచ్చేడనుకోవడంతో, పొందే ఆనందానికి దాసుడే అయి....వచ్చేనెలలో కొందాం అనే అనుకున్నాడు.

ఆనెలలో ఖర్చులూ జమలు, తెచ్చిన బదుళ్ళతో లెఖ్ఖ వేస్తే, వచ్చే మూడునెలల జీతం, ఇంటి ఖర్చుకు పెట్టకుండావుంటే తీరుతుందన్నట్లు నుంచుంటే, బుర్రగోకున్నాడు....

"సన్యాసుల్లో కలియకూడదూ?" అంది మనస్సు.

ఒక్కసారి తిరగబడి, ఆ మహానాయకుణ్ణి తిట్టుకున్నాడు. తన్నీ తిట్టుకున్నాడు...

• • •

ఆ ఒకటో తారీఖు రానే వచ్చింది.

దరిదాపు రెండునోట్లతోనే గుమ్మం ఎక్కేసరికి, ఇంట్లోపెంకులెగిరేటట్లు పురాణాలు విన్పిస్తే తెల్లబోయేడు.

అంతవరకూ ఇంటావిడకు, ఇంతమంది నేస్తాలు వున్నారన్న భావనే పోలేదు.

"క్లబ్బు వార్షికోత్సవంకు మీరు తప్పక ప్రేట్రన్ టిక్కెట్టు కొనాలి... మీవారి హోదాకు సరిపోతుంది" అంది ఓ ఆవిడ.

"దానికేం.... అల్లాగే" ఇంటావిడ,

గుబిల్లుమన్నవి యాజులు గుండెలు. పేట్రన్ టిక్కెట్టంటే పాతికరూపాయిలు.

"బేబీ సెంటర్లో రేపు ఆదివారంనాడు బీదపిల్లల్కు బట్టలు పంచాలనుకుంటున్నాం.... మరి..." నసికింది ఇంకోగొంతు.

"నావంతు ఓడజను చొక్కాలు చెడ్డీలువేసుకోండి."

యాజులు ఇరవై ఐదు ప్లస్ ఇరవై అనుకున్నాడు.

ఇల్లాగే ఇంకోరెండు.

మొత్తం ఓ వచ్చనోటువరకూ. వాగ్దానాలు, వెను వెంబడి ధన్యవాదాలు వినపడనేపడ్డాయి. వళ్ళుమండింది. ఈ చెయ్యలేని శిబిచక్రవర్తిత్వానికి..

తను ఈనెలలో తృణమో పణమో ఇచ్చి తృప్తి పరుద్దామనుకున్నా, అంకెల్లోటూడిక తీసివేతలు రాచ్చిప్పల్లా ఉండడం గుర్తించలేమా? ఎంత కష్టపడి సంపాదించి సంసారాన్ని ఈదుకుని ఈస్థితికివచ్చేడో ఆలోచించక్కర లేదూ?

మడులా, మాన్యాలా, ఎడతరక్కుండా వచ్చే గనులనుకుందా?

కోపం వచ్చింది.... పిడికిళ్ళుబిగబట్టేడు ఖండువాక్రింద.

వాళ్ళు, ఒకళ్ళ తర్వాత ఒకళ్ళు సావిట్లోకి రానే వచ్చి, నిలబడేపోయేరు. ఒకావిడ గొంతు సవరించుకుంది. మరొకామె కళ్ళతోనే చెప్పింది. ఇంకొకతె సిగ్గున్నూ పడిపోయింది.

"నమస్కారాలు...." అన్న స్వరమేళనం.

చెయ్యివూపేడు గుటకపడక.

ఇంటావిడ వస్తూనే "ఈవిడ కాంగ్రెస్ వర్కరు. మహిళా సంఘ ప్రెసిడెంటు. ఆవిడ లేడీస్‌క్లబ్ సెక్రటరీ. ఈవిడ శిశుసంరక్షణలయ కార్యదర్శి. ఆవిడ..." ఆ వరసలో చదివేసింది ...

ఆఖరునే.... "వాళ్ళు...." చూచి నవ్వేసింది.

గుడ్లు గుండ్రాలయితే, కళ్ళెంవేసిన కబంధుడిలాగే తీసి ఇచ్చేడు. రేపటినిగూర్చి తనస్థితికి గోలెట్టుతూనే....

"మీపేరు విన్నాం.... చాలామంది చెప్పేరు. త్యాగాన్కి చెయ్యే లేదని...." అన్న వాక్యాలు, క్షణికం మత్తుచల్లినా చిల్లుపడిన అప్పుల తీర్పకం, అమరంతో వుంది అన్న భావన క్షణభంగురం చేసేసింది ...

వాళ్ళు వెళ్లేరు. వంగిన పమిటల్లో చేతుల్ను చూపుతూనే....

ఏదో బ్రహ్మాండం బద్దలుకొట్టా లన్నంత ఆవేశం, పీక మెలివెయ్యాలన్నంత జుగుప్స కోపం, నవనీతం అయ్యేయి.

పక్కన నవ్వింది ఇంటావిడ. వచ్చి దగ్గరగా కూర్చుంటూనే "నిజంగా చెప్పండి. మనిద్దరం ఇల్లా దేవుడిచ్చినదాంట్లో త్యాగం చేస్తే ఎంతపేరు, ఎంత ప్రతిష్ఠా వస్తుంది. అప్పుడు మనం వూరికంతా...."

కళ్ళలోకి చిలిపిగా చూచింది.

ఛెళ్ళున లెంపకాయ కొట్టాలనే చెయ్యి ఎత్తేడు.... కాని....

వెనుక వెనుక తను నేర్పిన విద్య తనకే ఒప్పచెపుతోందంటే, నడుం విరిగిపోయే లోపల్కి వెళ్ళేడు .. వూగిపోతున్న రేపును గూర్చి, తర్క వితర్కాలమధ్య.

• • •

ఉదయం, ఉడుతూ మడుతుంటే లేచి కోటు వేసుకుంటుంటేనే గంపల్లో దిగుమతీ అయ్యింది.

ఒకదాంట్లో ఇంట్లో కావలసినవన్నీ ఇంకొక దాంట్లో మరికొన్ని బ్లౌజు గుడ్డలు....

తెల్లబోయేడు.... అంతవరకూ ఇవి ఎల్లా కొనాలో తెలియక బుర్ర పగలకొట్టుకున్నాడు కూడాను.

ఆవిడా నవ్వుతూనే "త్యాగం" అంది. కళ్ళప్పగిస్తే "వాళ్ళేవ రనుకున్నారు.... అందరూ ..."

అర్థం అయిపోతే ఒక్క వుదుట్లో వెళ్ళి పొదవిలోకి తీసుకున్నాడు.... ఒలసి, కళ్ళలోకి చూచి కరగిపోతే. వెనక స్వార్థం తీరిన తర్వాతనే త్యాగం, అన్న ముక్కలు, వేదాలు పన్నాలు చదివినట్లే వల్లియం అయ్యింది.

"దాసోహం" అన్నాడు రెండు చేతులూ ఎత్తి.

కారణం తెలియక అప్పుడప్పుడు మహానాయకుల వేపు చూచి, టోపీ పెట్టుకోవాలా, తలపాగా చుట్టాలా అన్న ఆలోచన సాగిస్తూనే వున్నాడు యాజులు. ★